సాక్షి మంచిర్యాల

శనివారం : 24 : ఫిబ్రవరి : 2024



ఖాళీగా డివిజన్ అధికారి కుర్చీ

జన్నారం ఫారెస్ట్ డివిజనల్ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడి ఎఫ్‌డీవో నాలుగు నెలల క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎవరినీ నియమించలేదు. 8లో▸



పంచాయతీల్లో 'ప్రత్యేక' ఇబ్బందులు

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. అధికారులు ఇలా వచ్చి అలా వెళ్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /19.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈశాన్యం దిశగా గాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గూడెంలో కొనసాగుతున్న సప్తాహం

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సప్తాహ భజనలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నిత్యవిధి, ప్రాబోధికి ఆరగింపు, తీర్థ ప్రసాద వితరణ, పంచసూక్త హోమాలు, నిత్యహోమాలు ఘనంగా నిర్వహించారు.

12శాతం రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం


మాట్లాడుతున్న పిడమర్తి రవి

జన్నారం: మాదిగ సామాజిక వర్గానికి 12శాతం రిజర్వేషన్ కోసం మాదిగల జోడో యాత్ర నిర్వహిస్తున్నామని, రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం ఆగదని మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి అన్నారు. ఆయన చేపట్టిన మాదిగల జోడో యాత్ర శుక్రవారం జన్నారం చేరుకుంది. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరు రోజులపాటు సాగే ఈ యాత్ర ద్వారా ముఖ్యమంత్రికి పలు డిమాండ్లు విన్నవిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి ఉప ముఖ్యమంత్రి, మంత్రి పదవులతోపాటు రెండు లోకసభ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా ఇంచార్జి చిలుక సంతోష్, మండల అధ్యక్షుడు గంగారెడ్డి, నాయకులు కత్తెరపాక రాజేశ్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి నివాళి


చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

నస్పూర్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఘన నివాళి అర్పించారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం లాస్య నందిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే లాస్య నందిత మృతి బాధాకరమని అన్నారు. పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వంగ తిరుపతి, నాయకులు నడిపల్లి విజిత్‌రావు, అమృత రాజ్‌కుమార్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

25న కబడ్డీ జట్టు ఎంపిక

శ్రీరాంపూర్: ఈ నెల 25న జిల్లా సీనియర్స్ మెన్స్ కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఎంపిక పోటీలు ఉంటాయని, ఎంపికైన వారు మార్చి 2 నుంచి 4 వరకు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని, పీఈటీ సదానందంకు రిపోర్టు చేయాలని కోరారు.


తాండూర్‌లో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పక్కన బీజేపీ నాయకులు


మంచిర్యాలలో నిర్వహించిన సభకు హాజరైన ప్రజలు

మరోసారి మోదీ

- దేశానికి మేలు జరిగే నేతను ఎన్నుకోవాలి
- అవినీతికి పాల్పడితే సీఎం అయినా వదిలేది లేదు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- జిల్లాలో విజయ సంకల్ప యాత్ర

మంచిర్యాలటౌన్/తాండూర్/మందమర్రిరూరల్: దేశానికి మేలు జరిగే నేతను ఎన్నుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల నుంచి విజయ సంకల్ప యాత్ర ప్రారంభించామని, ఏప్రిల్‌లో జరిగే ఎన్నికల్లో ప్రధానిగా మరోసారి మోదీని ఎన్నుకోవాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర శుక్రవారం జిల్లాలోని బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల నియోజకవర్గాల్లో సాగింది. బెల్లంపల్లి, తాండూర్, మందమర్రి, మంచిర్యాలలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే తనకు మంచిర్యాలతో అనుబంధం ఉందని, మంచిర్యాల సూపర్‌బజార్‌కు రాజేశ్వర్‌రావు చైర్మన్‌గా ఉన్నప్పుడు వచ్చానని గుర్తు చేసుకున్నారు. ఏ ఊరికి వెళ్లినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ మోదీ ప్రధాని కావాలని చర్చ జరుగుతోందని తెలిపారు. 2014కు ముందు దేశ పరిస్థితి ఏ విధంగా ఉందో.. ఇప్పుడు ఏ విధంగా ప్రజలందరికీ తెలుసునని అన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా పదేళ్లు పని చేసినప్పుడు రోజుకో కుంభకోణం జరిగిందని, రూ.12లక్షల కోట్లు దోపిడీ చేశారని విమర్శించారు. నీతివంతమైన పాలన, సమాజ అభివృద్ధి కోసం 2014లో 270 సీట్లతో ప్రజలు బీజేపీని గెలిపించారని, మోదీ ప్రభుత్వంలో ప్రతీ ఒక్కరం నీతి, నిజాయతీగా పని చేసి పాలన కొనసాగించామని తెలిపారు. తొమ్మిదిన్నరేళ్లలో ఒక్కరూపాయి అవినీతి జరగలేదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో దేశంలో ఉగ్రవాదం, బాంబుపేలుళ్లు, పాకిస్తాన్ ఉగ్రవాదం ఉండేదని, బీజేపీ పాలనలో ఉగ్రవాదాన్ని మోదీ ప్రభుత్వం కూకటివేళ్లతో పెకిలించిందని, మతకల్లోహాలు లేవని, ఉగ్రవాదం కనుమరుగైందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు హైదరాబాద్‌లో పేల్చిన బాంబు దాడిలో హాజీపూర్ మండలం నంనూరుకు చెందిన విజయ్‌కుమార్, శేఖర్ మృతిచెందారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి అయినా, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులైనా ప్రజాధనాన్ని దోచుకునే ఏ వ్యక్తినీ వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో అవినీతికి, కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగా తమ పోరాటం మరింత కొనసాగుతుందని తెలిపారు.

ఆ పార్టీలకు చరమగీతం పాడాలి

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండూ కుటుంబ పార్టీలేనని, ఆ పార్టీలకు ప్రజలు చరమగీతం పాడి బీజేపీని ఆదరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. స్కాంలు, ప్రజాధనం దోపిడీకి ఆ పార్టీలు నిలయాలని విమర్శించారు. ఢిల్లీ పీఠం మూడోసారి కూడా బీజేపీదేనని, కేంద్రంలో అధికారంలోకి తీసుకు రావడానికి కార్యకర్తలు పట్టుదలతో పని చేయాలని అన్నారు. తొమ్మిదిన్నరేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏనాడూ ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. రోజుకు 18 గంటలు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మధ్యనే ఉంటూ దేశాభివృద్ధికి పాటుపడుతున్నారని అన్నారు. మంచిర్యాలలో నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పలువురు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు పల్లె గంగారెడ్డి, ఎస్.కుమార్, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, నాయకులు ముల్కల్ల మల్లారెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, భూమన్న, దుర్గం అశోక్, ఏమాజీ, పులగం తిరుపతి, శ్రీకృష్ణదేవరాయలు, సంగీత, బాల్‌రెడ్డి, అక్కల రమేష్, మార్త కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కమనాథుల్లో ఉత్సాహం

బెల్లంపల్లి: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర జిల్లాలోని ఆ పార్టీ నాయకుల్లో ఉత్సాహం నింపింది. ఈ నెల 20న నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రారంభమైన యాత్ర కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా మీదుగా మంచిర్యాల జిల్లాలోకి ప్రవేశించింది. తాండూర్‌లో పార్టీ శ్రేణులు కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఐబీ నుంచి బెల్లంపల్లి వరకు మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. బెల్లంపల్లిలోని కన్నాల బస్తీ, కొత్త బస్టాండ్ ఏరియా, టేకుల బస్తీ, పాత బస్టాండ్, బజారు ఏరియా మీదుగా కాంటా చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలి వరకు ర్యాలీ సాగింది. అనంతరం కిషన్‌రెడ్డి కాంటా చౌరస్తా వద్ద బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాలపై విరుచుకుపడుతూ కార్యకర్తల్లో జోష్ నింపారు. సభలో కళాకారులు ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్


మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు బోర్డు నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోతిలాల్ అన్నారు. శుక్రవారం ఐడీవోసీ సమావేశం మందిరంలో డీఐఈవో శైలజ అధ్యక్షతన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో అలసత్వం వహించొద్దని సూచించారు. డీఐఈవో శైలజ మాట్లాడుతూ విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా కేంద్రాలకు వెళ్లి పరీక్ష రాయొచ్చని తెలిపారు. జిల్లాలో 25 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ప్రథమ సంవత్సరం 8,394మంది, ద్వితీయ సంవత్సరం 7,135 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఈ నెల 28నుంచి మార్చి 16 వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు శరత్‌కుమార్, నగేశ్, వివిధ కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఫ్లయింగ్‌స్క్వాడ్, కస్టోడియన్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సమష్టిగా పని చేయాలి

చెన్నూర్: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సమష్టిగా పని చేసి విజయవంతం చేయాలని చెన్నూర్ ఆర్వో, స్పెషల్ కలెక్టర్ సిడాం దత్తు అన్నారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో శుక్రవారం ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ గత ఎన్నికల్లో అధికారులు సమయపాలన పాటించకపోవడంతో ఇబ్బందులు వచ్చాయని, గతంలో జరిగిన పొరపాట్లను సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నూర్ తహసీల్దార్ మల్లికార్జున్, ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ, నియోజకవర్గంలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

అడుగంటుతున్న జలం!

- 'ఎల్లంపల్లి'లో తగ్గుతున్న నిల్వలు
- సాగు, తాగునీటిపై ప్రభావం


నీరు తగ్గడంతో తేలిన పాత వంతెన

దండేపల్లి: జిల్లాలో భూగర్భ జలం అడుగంటుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎల్లంపల్లి ప్రాజెక్టులో సుమారు 6నుంచి 7టీఎంసీలకు పైగా నీటి నిల్వలు పడిపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రాజెక్టు నీటిని తాగు, సాగునీటి అవసరాలతోపాటు ఎన్టీపీసీకి విడుదల చేస్తున్నారు. వేసవికి ముందే ఎండలు తీవ్రం కావడం, కాళేశ్వరం నుంచి ఎత్తిపోతలు నిలిచిపోవడం ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడానికి కారణంగా తెలుస్తోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో మునిగి ఉన్న దండేపల్లి మండలం గూడెం వద్ద గోదావరి పాత వంతెన పదిహేను రోజుల క్రితమే బయటపడింది. పుష్కరఘాట్లు కూడా తేలాయి. క్రమంగా గోదావరి నదిలో నీటిమట్టం భారీగా తగ్గుతోంది.

నీటి నిల్వ ఇలా..

ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 10.89 టీఎంసీల నీరుంది. ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడం, ఎలాంటి ఇన్‌ఫ్లో, కాళేశ్వరం నుంచి ఎత్తిపోసే అవకాశాలు లేవు. అయినప్పటికీ హైదరాబాద్ మెట్రోవాటర్‌కు 300 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, గూడెం ఎత్తిపోతలకు 290 క్యూసెక్కుల నీటితోపాటు, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని తాగునీటి కోసం అవసరాల మేరకు వినియోగిస్తున్నారు.

వాలిపోతున్న మొక్కజొన్న


మొక్కజొన్నను చూపిస్తున్న రైతు శివలాల్

దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన ఈ రైతు పేరు శివలాల్. ప్రస్తుతం యాసంగిలో తన ఆయిల్‌ఫాం తోటల అంతర పంటగా ఎకరన్నర మొక్కజొన్న సాగు చేశాడు. వేసవికి ముందే ఎండలు మండిపోవడంతో వ్యవసాయ బావిలో నీళ్లు అడుగంటాయి. గతంలో ఆరు గంటలు మోటారు నడిచినా తగ్గని నీళ్లు.. ఇప్పుడు నాలుగు గంటలు నడిచే వరకే అయిపోతున్నాయి. దీంతో పూర్తి స్థాయిలో నీరందక మొక్కజొన్న వాలిపోతోంది.

నీళ్లు సాల్తలేవ్..



నూతులల్ల నీళ్లు సాల్తలేవ్. ఎండలు ముదిరిపోయి అడుగంటుతున్నయ్. అప్పట్లో ఆరుగంటలు మోటార్లు నడిచిన అయిపోని నీళ్లు మూడు గంటలు నడిసే సరికే అయిపోతున్నయ్. ఇప్పుడే ఇట్ల ఉంటే మరి ఎండలు బాగా ముదిరితే పరిస్థితి కష్టమే అనిపిస్తుంది. నీళ్లు ఊరిన కొద్దీ పొలం కాడికి అచ్చి నీళ్లు పెట్టుడయితంది. –కొప్పుల మల్లయ్య, రైతు, వెల్గనూర్

అప్రకటిత కోతలతో ఇబ్బందులు



భీమారం: ఏసంగిలో రెండెకరాల్లో వరి సాగు చేస్తున్న. విద్యుత్ నిరంతరం సరఫరా కావడం లేదు. సాయంత్రం ఆరు గంటలకు పోతే అర్ధరాత్రి 12 గంటలకు ఇచ్చేవారు. కొన్ని రోజుల నుంచి తెల్లవారు జామున 2గంటలకు ఇస్తున్నారు. వరి పొలానికి నీరు అందక ఎండిపోతోంది. పగలు కూడా ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా 24గంటలపాటు విద్యుత్ అందించాలి. – దుర్గం రాములు, రైతు, అంకూసాపూర్

ఐబీ ఆవరణలో ఎంసీహెచ్ నిర్మాణం

- మంచిర్యాల మున్సిపల్ సమావేశం తీర్మానం
- రోడ్డు పక్కన అక్రమ నిర్మాణాల తొలగింపునకు ఆమోదం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్: యేటా వర్షాకాలంలో వరదనీటిలో మునిగిపోతున్న జిల్లా కేంద్రంలోని గోదావరి ఒడ్డున ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)ను ఐబీ ఆవరణలో నిర్మించాలని మంచిర్యాల మున్సిపల్ సాధారణ సమావేశం తీర్మానించింది. మున్సిపల్ సమావేశం శుక్రవారం నూతన చైర్మన్ రావుల ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తయినందున కూల్చివేసి ఎంసీహెచ్ నిర్మిస్తే నిధులు వృథా అవుతాయని, ప్రత్యామ్నాయం ఆలోచించాలని అన్నారు. పాలకవర్గ కౌన్సిలర్లు స్పందిస్తూ కొంతమేర నిధులు వృథాగా మారినా ఎంసీహెచ్ మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉండడం ముఖ్యమని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు భావించారని, అందుకే ఇంటిగ్రేటెడ్ నిర్మాణం తొలగించి ప్రజల కోరిక మేరకు ఎంసీహెచ్ నిర్మిస్తామని తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఆక్రమణలు, కట్టడాలు ప్రజలకు ఇబ్బంది లేకుండా తొలగించాలని, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ముందు ప్రహరీని ఆనుకుని వేసిన 15 తాత్కాలిక అక్రమ షట్టర్లను తొలగించాలని తీర్మానించారు. పారిశుధ్య కార్మికులు, మల్టిపర్పస్ వర్కర్స్‌కు ప్రస్తుతం ఇస్తున్న వేతనానికి రూ.వెయ్యి అదనంగా అందించేందుకు తీర్మానం చేశారు. గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లో పారిశుధ్య పనులకు గాను 30 మంది అదనపు కార్మికుల వేతనాలకు రూ.13.50 లక్షలు, అభివృద్ధి పనులకు రూ.13.42 లక్షలు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. వీధి దీపాలు, స్తంభాలు తరలించేందుకు అంచనా వ్యయం రూ.13.88 లక్షలు విద్యుత్ శాఖకు చెల్లించేందుకు ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ సల్ల మహేష్, కమిషనర్ మారుతి ప్రసాద్, మేనేజర్ కె.విజయ్‌కుమార్, ఇంజినీర్ పి.మధుకర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శ్యాంసుందర్, హెల్త్ అసిస్టెంట్ ఆర్.సునిల్‌కుమార్ పాల్గొన్నారు.


సమ్మక్క, సారలమ్మ గద్దె వద్ద భక్తులు


అమ్మవారికి మొక్కుతున్న యువతి

దీవించుతల్లీ..!

- వనదేవతల దర్శనానికి పోటెత్తిన భక్తులు
- మూడో రోజూ తగ్గని జనహోరు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల గోదావరి నది తీరాన సమ్మక్క–సారలమ్మ జాతరకు భక్తజనం పోటెత్తింది. శుక్రవారం మూడో రోజూ అమ్మవార్ల దర్శనానికి తరలివచ్చింది. నిలువెత్తు బంగారం, ముడుపులు సమర్పించి దీవించుతల్లీ అంటూ వేడుకున్నారు. దర్శనానికి గంటల తరబడి వరుసల్లో బారులు తీరారు. కోళ్లు, మేకలు బలి ఇచ్చి అక్కడే వంట చేసుకున్నారు. జాతరకు వచ్చిన వారిలో కొందరు తిరుగుపయనం కాగా.. మరికొందరు వచ్చి మొక్కులు సమర్పించారు. విద్యార్థులు ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. క్యూలైన్‌లో ఓ పాప స్పృహ తప్పి పడిపోవడంతో దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు ముక్తా రవి, రంగు రవికిషన్‌గౌడ్, గోపాల్‌రావు బయటకు తీసుకురాగా.. వైద్యసిబ్బంది సేవలందించారు. గోదావరి రోడ్‌లో జాతరకు వెళ్లే వాహనాలు, భక్తుల రాకపోకలతో సందడిగా మారింది. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. ఎన్‌సీసీ, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సేవలందించారు.

మొక్కులు తీర్చుకున్న మాజీ ఎమ్మెల్యే

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కుటుంబసభ్యులతో కలిసివచ్చి దర్శనం చేసుకున్నారు. నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తరఫున మహిళా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిలువెత్తు బంగారం సమర్పించారు.

పాలవాగు ఒడ్డున..

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కే 1ఏ గని శివారు పాలవాగు ఒడ్డున సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతరలో శుక్రవారం సమ్మక్క–సారలమ్మలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోల్‌బెల్ట్ ఏరియాతోపాటు చుట్టుపక్క ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. సింగరేణి అధికారులు, వివిధ కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు దర్శించుకున్నారు. ఏరియా ఎస్‌ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆయా గనులు, డిపార్ట్‌మెంట్ల అధికారులు పాల్గొన్నారు.


బంగారంతో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


ప్రేమ్‌సాగర్‌రావు తరఫున బంగారం సమర్పణ


రామకృష్ణాపూర్: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


దర్శనానికి బారులు తీరిన విద్యార్థులు, భక్తులు

గాంధారి మైసమ్మ జాతర షురూ


నదీజలాలతో దేవతామూర్తులను శుద్ధిచేస్తున్న ఆదివాసీలు

- సంప్రదాయ పూజలతో ప్రారంభం
- దేవతామూర్తుల ఊరేగింపు


ఊరేగింపుగా వెళ్తున్న ఆదివాసీలు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులో గాంధారి మైసమ్మ జాతర శుక్రవారం ఆదివాసీల సంప్రదాయ పూజలతో వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు నిర్వహించనున్న జాతరలో భాగంగా మొదటి రోజు సంప్రదాయం ప్రకారం సదర్ భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తులతో ఊరేగింపు నిర్వహించారు. తప్పెటగూళ్ల ఆటలు, పిల్లనగ్రోవి వాయిద్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా బొక్కలగుట్ట, గాంధారి వనం, గద్దెరాగిడి మీదుగా మంచిర్యాల గోదావరి నదికి తరలివెళ్లారు. నదిలో దేవతామూర్తులకు సంప్రదాయబద్ధంగా నైవేద్యం సమర్పించి పట్నాలు వేశారు. సాయంత్రం అక్కడి నుంచి సదర్‌భీమన్న ఆలయం వద్దకు తీసుకువచ్చారు. శనివారం ఉదయం గ్రామ దేవత పోశమ్మ తల్లికి పూజలు నిర్వహించి భీమన్న దేవునికి పట్నాలు వేయనున్నారు. సాయంత్రం గోదావరి జలాలతో దేవతామూర్తులకు మరోసారి అభిషేకాలు చేసి జాతర జరిగే ఖిల్లా దిగువ ప్రాంతానికి దేవతామూర్తులను తీసుకెళ్తారు. రాత్రి 8 గంటలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తప్పెటగూళ్ల, లక్ష్మీదేవర కళాకారులు సంప్రదాయ పద్ధతిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి రొడ్డ వంశస్తులు, పూజారులతో మైసమ్మ తల్లికి పెద్ద పూజ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన శాలివాహన పవర్‌ప్లాంట్ కార్మికులు



కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పాతమంచిర్యాల: బీజేపీ విజయ సంకల్పయాత్రలో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని శుక్రవారం జిల్లా కేంద్రంలో శాలివాహన పవర్‌ప్లాంట్ కార్మికులు కలిసి వినతి పత్రం అందించారు. శాలీవాహన పవర్‌ప్లాంట్‌ను యాజమాన్యం 15నెలల క్రితం మూసివేసిందని, అప్పటి నుంచి కార్మికులను రావాల్సిన వేతనాలు, కంపెనీ క్లోజింగ్ బెనిఫిట్‌లు ఇవ్వకుండా పవర్‌ప్లాంట్ మేనేజింగ్ డైరెక్టర్ మల్క కొమురయ్య ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షులు కుంటాల శంకర్, కార్మికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షులు లగిసెట్టి కమలాకర్,కార్యదర్శి మద్దూరీ రాజు పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి ప్రవేశాలు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ప్రవేశం కోసం షెడ్యూల్డ్ కులాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు రెండు సీట్లను కేటాయించడం జరిగిందని, అభ్యర్థులు జిల్లా వాసులై ఉండి, జూన్ 1, 2017 నుంచి మే 31, 2019 మధ్య జన్మించి ఉండాలని, సంబంధిత శాఖ ద్వారా జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అభ్యర్థి పేరిట జారీ చేయబడిన కుల ధృవీకరణ పత్రం ఉండాలని, అభ్యర్థులు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ధృవపత్రాలతో మార్చి 12వ తేదీ సాయంత్రం 3 గంటల్లోగా దరఖాస్తులను సమర్పించాలన్నారు. మార్చి 15వ తేదీన లాటరీ పద్ధతిన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని, ఇతర వివరాలకు 9441874738 నంబరులో, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

గుండె పోటుతో బీటెక్ విద్యార్థిని మృతి

నర్సాపూర్(జి): మండలంలోని బామిని(బి) గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని గుండెపోటుతో మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు... మండలంలోని బామిని(బి) గ్రామానికి చెందిన నార్వాడే హాసిని(18) హైదరాబాద్‌లో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఆరోగ్యం బాగలేక పోవడంతో ఇటీవల ఇంటికి వచ్చేసింది. గురువారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందింది. తండ్రి నార్వాడే వెంకట్ రావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కూతురు మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భైంసారూరల్: భైంసా – నిర్మల్ జాతీయ రహదారిపై శుక్రవారం తిమ్మాపూర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సత్యం సాయన్న, ఉంబిరి సాయన్న ద్విచక్ర వాహనంపై కల్లూరు నుంచి తిమ్మాపూర్‌కు వెళ్తున్నారు. అదే క్రమంలో నిర్మల్ వైపు నుంచి భైంసా వైపునకు వస్తున్న కారు ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్సులో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఖాళీగా డివిజన్ అధికారి కుర్చీ



జన్నారం డివిజన్ కార్యాలయం

- నాలుగు నెలలైనా భర్తీచేయని వైనం
- పెరుగుతున్న కలప స్మగ్లింగ్
- కవ్వాల్ టైగర్‌జోన్‌కు గుండెకాయ జన్నారం



పట్టుబడిన కలప ట్రాక్టర్ (ఫైల్)

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌కు గుండెకాయ జన్నారం అటవి డివిజన్. దట్టమైన అడవులు, పులికి ఆవాసం కోసం సరిపడ వన్యప్రాణులు. దట్టమైన టేకు వనం ఉంది. టైగర్‌జోన్ ఏర్పాటు నుంచి పులిరాక కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. పులి రాకపోకలే తప్ప స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. ఈ అడవిని రక్షించేందుకు జన్నారం డివిజన్‌కు ఫారెస్ట్ డివిజనల్ అధికారిని నియమించారు. ఇక్కడ పనిచేసిన ఎఫ్‌డీవో బదిలీపై వెళ్లి నాలుగు నెలలు గడుస్తున్నా.. ఆయన స్థానంలో మరో ఎఫ్‌డీవోను నియమించలేదు. దీనికి తోడుగా రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారుల కొరత ఉండటంతో స్మగ్లింగ్ మళ్లీ మొదలైనట్లు తెలుస్తోంది.

నాలుగు నెలలైనా నియమించని వైనం...

జన్నారం అటవి డివిజన్ పర్యటక రంగానికి, దట్టమైన అడవులకు చిరునామా. ఇక్కడి అడవులు కవ్వాల్ టైగర్‌జోన్‌కు గుండెకాయ అని చెప్పుకుంటారు. టైగర్‌జోన్ పరిధిలో కేవలం 21శాతం ఉన్న జన్నారం అటవి డివిజన్‌కే ఉన్నత అధికారులు అధిక ప్రాధాన్యతను ఇస్తారు. గడ్డిక్షేత్రాల నిర్వహణ, వన్యప్రాణుల సంతతి పెంపొందించడంలో జన్నారం డివిజన్ రాష్ట్రంలో ప్రత్యేక స్థానం సంపాదించింది. నాలుగున్నర సంవత్సరాలుగా పని చేసిన గత ఎఫ్‌డీవో సిరిపురం మాధవరావు ఇక్కడ మార్పులు తీసుకువచ్చారు. ఆయన నవంబర్ మాసంలో బదిలీపై హైదరాబాద్ ప్రధాన అటవి కార్యాలయానికి వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడ ఎఫ్‌డీవోను నియమించలేదు. దీనికి తోడు జన్నారం, ఇందన్‌పల్లి అటవి రేంజ్‌లకు ఒక్కరే రేంజ్ అధికారి ఉండటం, డివిజన్‌లో పలు సెక్షన్, బీట్ అధికారుల కొరత ఉండడంతో స్మగ్లింగ్ నిరోధంలో అధికారులు విఫలమవుతున్నట్లు చెప్పవచ్చు.

కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం..

కలప స్మగ్లింగ్ నిరోధించడంలో కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. కొందరు పరోక్షంగా స్మగ్లర్లకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. కవ్వాల్ సెక్షన్ పరిధి నుంచి నిత్యం వివిధ రకాల వాహనాల ద్వారా కలప తరలిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మోటార్ సైకిళ్లపై టేకు సైజులను తరలిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అర్ధరాత్రి 12గంటల నుంచి తెల్లవారు జామున నాలుగు గంటల వరకు ద్విచక్ర వాహనాలు, నెత్తిమోతలతో కలపను సమీప గ్రామాలకు చేరవేస్తున్నట్లు పలువురు గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికే కవ్వాల్ సెక్షన్ అధికారి, రాయికుంట బీట్ అధికారులను ఉన్నత అధికారులు సస్పెండ్ చేశారు. అయిన ఇంకా మార్పు రాకపోవడం సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇప్పటికైనా స్మగ్లింగ్ నిరోధానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తరలిపోతున్న కలప

జన్నారం అటవి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల గుండా విలువైన టేకు కలప తరలిపోతున్నట్లు తెలుస్తోంది. జన్నారం, ఇంధన్‌పల్లి అటవి రేంజ్‌లోని పలు బీట్‌ల నుంచి స్మగ్లింగ్ జరుగుతున్నట్లు ఇటీవల జరిగిన సంఘటనలతో తెలుస్తోంది. డివిజన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్ కవ్వాల్ అటవి సెక్షన్‌లోని రాయికుంట బీట్ నుంచి టేకు కలపను జోడేఘాట్ రేంజ్ వైపు కొందరు స్మగ్లర్లు తీసుకెళ్లి కొత్తపెల్లి నిలువ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌డీపీటీ ఆదేశాల మేరకు గత ఫిబ్రవరి 4న రాయికుంట బీట్ తనిఖీలు చేశారు. అక్కడ నుంచి కలప తరలిపోయినట్లు అధికారులు గుర్తించి రిపోర్టు చేయడంతో కవ్వాల్ సెక్షన్ అధికారి, రాయికుంట బీట్ అధికారిలను ఉన్నత అధికారులు సస్పెండ్ చేశారు. అదే విధంగా ఈనెల 13న మహ్మదబాద్, తపాలపూర్ అటవి బీట్‌లో స్మగ్లింగ్‌కు పాల్పడ్డారనే అభియోగంపై మల్యాల గ్రామానికి చెందిన ముడితే నర్సయ్యను కోర్టులో హాజరు పరుచగా ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించారు. అదే విధంగా ఈనెల 22న కవ్వాల్ అటవి సెక్షన్ నుంచి జన్నారం మీదుగా అక్రమంగా కలప తరలిస్తున్న షిఫ్ట్ కారును అధికారులు పట్టుకున్నారు.

త్వరలో నియామకం

జన్నారం అటవి డివిజన్ అధికారి నియామకం కోసం ప్రభుత్వానికి రిపోర్టు పంపాము. త్వరలోనే నియామకం జరుగుతుంది. అదే విధంగా స్మగ్లింగ్ నిరోధంపై కఠినంగా వ్యవహరిస్తాం. డివిజన్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరికలు జారి చేస్తాం. కఠినంగా వ్యవహరించాలని, స్మగ్లింగ్ నిరోదానికి తగు చర్యలు తీసుకోవాలని సూచిస్తాం.

– శాంతరాం, ఫీల్డ్ డైరెక్టర్, కవ్వాల్ టైగర్‌జోన్

పంచాయతీల్లో 'ప్రత్యేక' ఇబ్బందులు



నాగారం గ్రామ పంచాయతీ కార్యాలయం

- ఇలా వచ్చి అలా వెళ్తున్నారు.!
- అత్యవసర పనులకు తప్ప కానరాని పాలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. ఫిబ్రవరి 1 నాటికి సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం గెజిటెడ్ స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి పంచాయతీ బాధ్యతలు అప్పగించింది. జిల్లాలో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే ప్రత్యేక అధికారులుగా నియామకమైన గెజిటెడ్ స్థాయి అధికారులు తమ మాతృశాఖతో పాటు అదనంగా అప్పగించిన రెండు, మూడు గ్రామాల ప్రత్యేక అధికార బాధ్యతలను కార్యదర్శుల భాగస్వామ్యంతో నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో అమలు చేయడం, మౌళిక వసతుల కల్పనపై దృష్టి సారించడం వంటి బాధ్యతలు ప్రత్యేక అధికారులకు అప్పగించారు.

సవాళ్లుగా మారిన పాలన..

పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన సవాల్‌గా మారింది. సర్పంచులకు ఉండే బాధ్యతలు ప్రత్యేక అధికారులకు ఉన్నాయి. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవో, ఎంపీడీవో, మండల ప్రత్యేక అధికారులు కలిసి ప్రతీ 15 రోజులకు లేదా నెల రోజులకు ఒకసారి గ్రామసభలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇంటి పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్య పనులపై దృష్టి సారిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలి. కానీ ప్రత్యేకాధికారులు వారి శాఖల బాధ్యతలు చూస్తూ పంచాయతీ బాధ్యతలు చూడాల్సి ఉంటుంది. అయితే అటు మాతృశాఖకు న్యాయం చేయలేక ఇటు పంచాయతీల బాధ్యతలు సక్రమంగా చూడలేక ప్రత్యేక అధికారులకు పాలన సవాల్‌గానే మారింది. ఏదేమైనా ఎన్నికలు పూర్తయి ప్రజాప్రతినిధులకు బాధ్యతలు అప్పగించేంత వరకు ప్రజలకు మాత్రం కష్టాలు తప్పేలా లేవు..

తేలని జాయింట్ చెక్ పవర్..

ప్రత్యేక అధికారికి, పంచాయతీ కార్యదర్శికి జాయింట్ చెక్‌పవర్ ఇంకా పూర్తిస్థాయిలో అందలేదు. చెక్‌పవర్ ఇప్పటికే ఇవ్వాల్సి ఉండగా బ్యాంకు, ట్రెజరీ పనులు ఇంకా చెక్‌పవర్‌కు సంబంధించి పనులు పెండింగ్‌లో ఉండటంతో పూర్తిస్థాయిలో అందలేదు. క్యాష్ బుక్, చెక్ బుక్, ఎంబీ రికార్డులు పంచాయతీ కార్యదర్శుల ఆధీనంలో ఉన్నాయి. సర్పంచులు పదవీకాలన్ని పొడగించాలని విన్నవించినా ప్రభుత్వం అందుకు అంగీకరించకుండా ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించింది. ప్రత్యేక అధికారులు వారి బా ధ్యతలు చూసుకుంటూ మూడు, నాలుగు పంచా యతీలకు అదనంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఇలా వస్తూ.. అలా నెట్టుకు వస్తున్నారు.

సొంత డబ్బులతో అభివృద్ధి చేశాం



సర్పంచుగా ఉన్నన్నాళ్లు అనేక బాధలు అనుభవించాం. సొంత డబ్బులు తీసుకువచ్చి మరీ అభివృద్ధి చేశాం. ప్రజాసేవలో ఏ రోజూ వెనకడుగు వేయలేదు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తమ సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక అవస్థలు పడుతున్నారు.

– కొట్టె మహేందర్, మాజీ సర్పంచ్, కర్ణమామిడి

హర్యానా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



నెన్నెలలో మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

పాతమంచిర్యాల: రైతులపై కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన హర్యానా ప్రభుత్వాన్ని బర్తఫ్ చేయాలని అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు టి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నల్ల జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతే దేశానికి వెన్నెముక అంటూనే రైతు వెన్నులో తుటాలు దించిన మోడీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. రైతులపై కాల్పులకు ఆదేశాలు జారీ చేసిన సీఎం, హోం మంత్రిలపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, అరుణోదయ రాష్ట్ర నాయకులు మల్లన్న, అరుణ, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి శ్రీ కాంత్, నాయకులు కాంతయ్య, బాపు, దీప్తి, పాపారావు, మగ్బూల్ పాల్గొన్నారు.

రైతులపై కాల్పులు జరపడం హేయమైన చర్య

నెన్నెల: పంటలకు మద్దతు ధర కోరుతూ ఢిల్లీ సమీపంలో ఆందోళన చేస్తున్న రైతులపై హర్యానా ప్రభుత్వం కాల్పులకు అనుమతులు ఇవ్వడం హేయమైన చర్య అని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు లక్కం తిరుపతి అన్నారు. మోదీ ప్రభుత్వ దౌర్జన్యానికి నిరసనగా ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి కొండు బానేష్, నాయకులు శంకర్, కృష్ణ, సాగర్, జోసెఫ్, గంగాధర్, మల్లేష్ పాల్గొన్నారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి గ్రామానికి చెందిన లెండుగురి కృష్ణ (38) శుక్రవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. కృష్ణ మద్యానికి బానిసై, మానసికస్థితి సరిగా లేక రాళ్లపేట–సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య వంజీరి గ్రామసమీపంలోని రైలు పట్టాల వద్దకు వెళ్లాడు. మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు వెళ్లే రైలు రావడంతో దాని కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సురేష్‌గౌడ్ తెలిపారు.



కృష్ణ మృతదేహం

చివరిచూపు కోసం 24 రోజులు..

- గల్ఫ్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌తో మండలవాసి మృతి
- ఎనిమిది నెలల క్రితం వివాహం
- గల్ఫ్ వెళ్లిన నాలుగు నెలలకే..



వెంకటేశ్ (ఫైల్)

జన్నారం: ఉన్న ఊరిని.. కట్టుకున్న భార్యను.. కనిపెంచిన తల్లీదండ్రులను వదిలి ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టిన యువకుడు శవమై తిరిగొచ్చాడు. బ్రెయిన్ స్టోక్‌తో 24 రోజుల క్రితం మృతిచెందగా అప్పటి నుంచి చివరి చూపు కోసం కుటుంబీకులు ఎదురు చూస్తున్నారు. జన్నారం మండలం దేవునిగూడ గ్రామానికి చెందిన కునారపు వెంకటేశ్(24) ఎనిమిది నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. ఉన్న ఊరిలో ఉపాధి లేక ఆరు నెలల క్రితం ఏజెంట్‌కు డబ్బులు పెట్టి ఇరాక్ దేశంలోని ఇబ్రహిల్ పట్టణానికి వెళ్లాడు. విధుల్లో ఉండగా జనవరి 30న బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. భర్త చివరిచూపు కోసం కంటిలో నీరు కడుపులో దాచుకుని భార్య ఎదురు చూస్తోంది. శుక్రవారం పెట్టెలో భర్త మృతదేహం స్వగ్రామానికి రావడంతో భార్య రోదన ఎవరు ఆపలేకపోయారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కల్లెడ భూమన్న, వర్కింగ్ ప్రసిడెంట్ తిరుపతి, సంఘం నాయకులు ఎల్ల య్య, కునారపు భీమరాజు మృతదేహం వద్ద నివా ళులర్పించారు. ఈ సందర్భంగా అప్పుల పాలైనా వెంకటేశ్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతదేహం స్వగ్రామం రావడానికి సహకరించిన ఎమిగ్రేట్ అసోసియేషన్ అధ్యక్షుడు మంద భీంరెడ్డి, అంబులెన్స్ ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.



నివాళులర్పిస్తున్న గల్ఫ్ అసోసియేషన్ నాయకులు

డీఏ, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

- ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు

మంచిర్యాలఅర్బన్: కరువు భత్యంతో (డీఏ) పాటు పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎస్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల డీఏను మంజూరు చేయాలని, పెరుగుతున్న ధరలతో మధ్య తరగతి, ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు నిలిచిపోవడంతో నిరాశకులోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ చూపి పెండింగ్ కేసులను పరిష్కరించి బదిలీల, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కరుణాకర్ మాట్లాడుతూ 317 జీవో ద్వారా ఎంతో మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు స్థానికతను కోల్పోయి కుటుంబాలకు దూరమై అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా నియమించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ట్రెజరర్ సత్తయ్య, జిల్లా మహిళ అధ్యక్షులు పద్మ, ఉపాధ్యక్షురాలు మహాలక్ష్మీ, ప్రధానోపాధ్యాయులు ప్రభావతి, మండల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు మల్లేష్, బాపు, కోటేశ్వర్‌రెడ్డి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలకు వచ్చిన అధికారులు..



రైస్ మిల్లుకు వేసి తాళం, సీల్



రైస్‌మిల్లు గేటుకు తాళం వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

- అందుబాటులో లేని రైస్‌మిల్లు యాజమాన్యం
- శనివారం తనిఖీలు నిర్వహించేందుకు మిల్లుకు తాళం

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలోని బాలాజీ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించేందుకు శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాగా రైస్‌మిల్లులో యాజమాన్యం అందుబాటులో లేకుండా మిల్లుకు తాళం వేసి ఉండడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెనుతిరిగారు. ఈ సందర్భంగా తాళం వేసి ఉన్న రైస్‌మిల్లు సీల్‌వేసి చేశారు. అలాగే రైస్‌మిల్లు గేటుకు తాళాలు వేసి వెళ్లారు. రైస్ మిల్లు తనిఖీలు శనివారం కొనసాగిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపారు. తనిఖీల్లో ఇన్‌చార్జి తహసీల్దార్ బక్కయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్యాంలాల్ ఉన్నారు.

మార్కెట్ చైర్మన్ రిజర్వేషన్ ఖరారు

- బీసీలకు రిజర్వు అయిన చైర్మన్ పదవీ
- బీసీ సామాజిక వర్గం నుంచి తీవ్ర పోటీ
- అధిష్టానం ఎవరికి పట్టం కట్టేనో..?



చెన్నూర్: చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రిజర్వేషన్ ఖరారైంది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ ఇప్పటి వరకు బీసీ సామాజిక వర్గానికి దక్కలేదు. చైర్మన్ పదవీ బీసీ జనరల్‌కు రిజర్వు చేయడంతో బీసీ సామాజిక వర్గ కాంగ్రెస్ నాయకుల్లో ఆశలు చిగురించాయి. ఇప్పట్లో ప్రత్యేక్ష ఎన్నికలు లేకపోవడంతో నామినేటెడ్ పోస్టులపై కాంగ్రెస్ నాయకులు ఆశలు పెంచుకున్నారు. ప్రస్తుతం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ ముందుండడంతో బీసీ నాయకుల్లో పోటీ తీవ్రమైంది. ఒక్క మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ కోసం పది మందికి పైగా పోటీ పడుతున్నారు. చైర్మన్ పదవీని దక్కించుకునేందుకు కాంగ్రెస్ నాయకులు పట్నం బాటపడుతున్నారు. ఎమ్మెల్యేను కలిసి ఎవరికి వారు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం.

చైర్మన్ రేసులో...

చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రేసులో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహ్మద్ బషీరోద్దీన్, చెన్న సూర్యనారాయణ, కుర్మ రాజమల్లగౌడ్, మహేశ్ ప్రసాద్ తివారి, గజ్జెల అంకగౌడ్, భీమారం గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్, పాతర్ల నాగరాజు, పెద్దింటి శ్రీనివాస్, సుద్దపల్లి సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్ ఉన్నారు.

పదవుల పందేరం ఎన్నికల తరువాతేనా..?

మార్కెట్ కమిటీ చైర్మన్‌ను పార్లమెంట్ ఎన్నికల ముందు నియామిస్తారా, ఎన్నికల తరువాత ఉంటుందా అనే అనుమానాలు నాయకుల్లో రేకెత్తిస్తున్నాయి. ఏప్రిల్‌లో ఎంపీ ఎన్నికలు ఉండడంతో ఇప్పట్లో చైర్మన్ నియామకం ఉండకపోవచ్చని తెలిసింది. పెద్దపల్లి ఎంపీ టిక్కెట్ కుమారుడు గడ్డం వంశీకృష్ణకు వస్తుందనే నమ్మకంతో వివేక్ ఉండడంతో ఎన్నికల తరువాత నామినేటెడ్ పదవుల పందేరం ఉంటుందని సమాచారం.

ఆగ్రో ఇండస్ట్రీ రైస్‌మిల్‌పై చర్యలు తీసుకోవాలి

జైపూర్: జైపూర్ మండలం రామారావుపేట శివారులో అక్రమంగా నిర్మిస్తున్న ఆగ్రో ఇండస్ట్రీ రైస్‌మిల్లు నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని, అక్రమ మట్టి, ఇసుక తరలింపుపై చర్యలు చేపట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సబావత్ మోతీలాల్, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదులు చేశారు. సర్వే నంబర్ 210, 218, 219లో అక్రమ కట్టడాలు, అక్రమంగా ఇసుక తరలించారని రైస్ మిల్లు నిర్వహకులు రెవెన్యూశాఖలోని పరిచయాలతో అధికారులను తప్పుదోవపట్టించి అనేక అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఫయాజ్, జిల్లా ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్ల విశ్వంభర్‌రెడ్డి, గుడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, సుంకరి శ్రీనివాస్ ఉన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఒకరి ఆత్మహత్య

సోన్: మద్యానికి బానిసై ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అల్లకొండ సంతోష్(47) నాలుగు నెలల క్రితం కూతురి వివాహం చేశాడు. అప్పటి నుంచి ఎలాంటి పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయాలని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన సంతోష్ పురుగుల మందుతాగాడు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన సంతోష్‌ను కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

మద్యం మత్తులో కిందపడి ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో కిందపడి ఒకరు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై వెంకటరమణ రెడ్డి ప్రకారం.. జైనథ్ మండలం గూడ గ్రామానికి చెందిన పొట్ట దేవిదాస్ (40) కొన్ని రోజులుగా మద్యానికి బానిస కావడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో కింద పడిపోవడంతో స్థానికులు అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఉమా ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.